క్లుప్తంగా

ఆధార్ కేంద్రం పరిశీలన



ఆధార్ నమోదు చేయించుకుంటున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని సచివాలయంలో చేపట్టిన ప్రత్యేక ఆధార్ నమోదు సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. ఆయన గురువారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని సచివాలయం వద్ద చేపట్టిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రంలో చిన్న పిల్లలు ఆధార్, నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ల మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆధార్ క్యాంపు కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాత్రికేయుడికి తీవ్ర గాయాలు



గాయపడిన జర్నలిస్టు రాహుల్

నాగలాపురం: ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఓ పాత్రికేయుడు అదుపు తప్పి కింద గాయపడిన సంఘటన వెలుగు చూసింది. వివరాలు.. మండలంలో ఓ దినపత్రికలో పని చేస్తున్న పాత్రికేయుడు రాహుల్ గాంధీ గురువారం తన స్వగ్రామం సురుటుపల్లి నుంచి బైక్‌పై నాగలాపురం వస్తుండగా మార్గమధ్యలో బైటకొడియంబేడు వద్ద బైకు అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని కుడి భుజం ఎముక విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ముఖం, చేతులు, కాళ్లకు కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తోటి పాత్రికేయులు, స్నేహితులు, స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కుడి భుజం ఎముక విరగడంతో అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

మోటర్లకు మీటర్లు పెడితే రైతులకు భారం

- జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రంగయ్య



రైతులతో మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రంగయ్య

ఏర్పేడు(రేణిగుంట): వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే రైతులకు అదనపు భారం తప్పదని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రంగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఏర్పేడు మండలం బండివానిపల్లెలో గురువారం రైతులతో కలిసి గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని చూడటం దుర్మార్గమన్నారు. మీటర్లు పెడితే రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేల వరకు అదనంగా రైతుల మీద భారం పడుతుందన్నారు. ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం దళారులు రివాజ్‌తో కలిపి 80 కిలోల ధాన్యం బస్తా రూ.1,600 లోపు కొని మిల్లర్లు లాభపడుతున్నారని చెప్పారు. ఇలాగే రైతు వ్యతిరేక విధానాలను అవలంబించినా, మోటార్లకు మీటర్లు బిగించే కార్యక్రమానికి స్వస్తి పలకపోయినా తాము రైతులతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకుడు ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అందరి సమన్వయంతో అభివృద్ధి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: అందరి సమన్వయంతో మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. గురువారం ఆయన మండలంలోని చిన్న పాండూరు పంచాయతీ వీకేఆర్‌వైకాలనీ, పెద్ద పాండూరు పంచాయతీలోని వేంకటేశ్వర గిరిజనకాలనీ, చెన్నవారిపాళెంలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం చిన్న పాండూరు పోలేరమ్మ గుడి వద్ద పశువుల దాహార్తి కోసం నూతనంగా నిర్మాణం చేయనున్న నీటితొట్టికు భూమిపూజ చేశారు. ఇందిరానగర్‌లో నూతనంగా నిర్మించిన పశువుల షెడ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ నిర్మల్, నాయకులు నరసరాజు, దశరథన్, పాండూరు ఎంపీటీసీ చిన్నయ్య, సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీడీఓ ప్రసాద్, శ్రీసిటీ సీఐ బీవీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిచ్చు రేపిన ఉపాధి పనులు



రోడ్డును తవ్వేయడంతో టీవీఎం కండ్రిగ వాసులను ప్రశ్నిస్తున్న చుక్కలనిడిగల్లు గ్రామస్తులు



పనులకు వచ్చిన చుక్కలనిడిగల్లు గ్రామస్తులు

- ఫారంపాండ్ పనులను అడ్డగింత
- రోడ్డును తవ్వేసిన టీఎంవీ కండ్రిగ గ్రామస్తులు
- నిలదీసిన చుక్కలనిడిగల్లు దళితులు
- ఇరు గ్రామాల మధ్య వివాదం
- వాగ్యుద్ధాలతో ఒకింత ఉద్రిక్తత
- సంఘటన స్థలాన్ని కానిస్టేబుల్ తప్పితే సందర్శించని అధికారులు
- వాదనలు, హెచ్చరికల నడుమ రోడ్డును మళ్లీ పూడ్చివేత



చుక్కలనిడిగల్లు గ్రామస్తులతో వాదిస్తున్న గ్రామ టీఎంవీ కండ్రిగ సర్పంచ్

శ్రీకాళహస్తి: చెరువు వివాదం రెండు గ్రామాల మధ్య చిచ్చు రేపింది. శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు పంచాయతీ 155/3సర్వే నంబరులో 12.56 ఎకరాలు విస్తీర్ణం గల సూరపవారి గుంట ఉంది. ఇక్కడ ఉపాధి పనులు చేయడానికి గురువారం చుక్కలనిడిగల్లు ఎస్సీ, ఎస్టీలు చేరుకున్నారు. ఫారంపాండ్ పనులు చేస్తుండగా టీఎంవీ కండ్రిగ గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. సర్పంచ్ ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వారిని అడ్డుకోవడంతో వివాదానికి దారితీసింది. తమ పంచాయతీ చెరువులో ఉపాధి పనులు చేసుకుంటూ ఉంటే అడ్డుకోవడం ఏమిటని దళితులు వారిని ప్రశ్నించారు. అయితే టీడీపీ మద్దతు సర్పంచ్ ఈశ్వరరెడ్డి.. తమ తాత ముత్తాతల కాలం నుంచి చెరువు తమ ఆధీనంలో ఉందని, ఇక్కడ ఉపాధి పనులు చేయడానికి వీల్లేదని ఆక్షేపించారు. మీరు చెరువులో ఫారంపాండ్ తవ్వితే, తమ గ్రామం మీదుగా చుక్కలనిడిగల్లు ఎస్సీ, ఎస్టీలు పనులకు వెళ్లకుండా రోడ్డును తవ్వేస్తామంటూ టీఎంవీ కండ్రిగ వాసులు కొందరు అన్నంత పనీ చేశారు. దీంతో ఇరు గ్రామాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులకు ఎంపీడీవో రఫీ సమాచారం ఇవ్వడంతో ఓ కానిస్టేబుల్ అక్కడికి చేరుకుని మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగా రోడ్డును తవ్వేసి రాకపోకలకు అవరోధం కలిగించడం తీవ్రమైన నేరం కిందకు వస్తుందని, కేసు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించడంతో తర్జన భర్జన పడి కొంతసేపటికి ఆ రోడ్డును మళ్లీ పూడ్చివేశారు. అయితే పరిస్థితి ఒకింత ఉద్రిక్తంగా ఉన్నా ఎంపీడీఓ, వీఆర్వోలు, ఎస్ఐ, ఉపాధి హామీ పథకం అధికారులెవరూ సంఘటన స్థలానికి వెళ్లకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఈ చెరువు ఎవరిదో తేల్చాలని చుక్కలనిడిగల్లు గ్రామస్తులు పట్టుబడుతుండగా, ఆ చెరువు తమ గ్రామానికే చెందిందని టీఎంవీకండ్రిగ వాసులు తెగేసి చెబుతున్నారు. ఈ సమస్య మరింత జఠిలం కాకముందే అధికారులు జోక్యం చేసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉంటోందని ఇక్కడి పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల రెవెన్యూ తహసీల్దారుగా శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సుబ్రమణ్యం గత నెల 31వ తేదీన పదవీ విరమణ చేశారు. దీంతో శ్రీకాళహస్తిలోని ఆర్‌డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న శ్రీదేవి తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. మండలంలోని భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీదేవి తెలిపారు.

భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న మొదలియార్ సంఘనేతలు, ప్రజాప్రతినిధులు

నాగలాపురం: తులువ వేళాల మొదలియార్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో గురువారం నాగలాపురం బైపాసులోని ఉదయ్ ఫ్యామిలీ డాబా పక్కన ఉన్న స్థలంలో నాగలాపురం గ్రామప్రజలు కర్మక్రియలు చేసుకోవడానికి, ఇతర సౌకర్యాల నిమిత్తం నూతన భవన నిర్మాణానికి భూమిపూజ ప్రారంభించారు. ఈ భవనాన్ని నాగలాపురం పార్వతమ్మ, కందస్వామి మొదలియార్ జ్ఞాపకార్థం నిర్మిస్తున్నట్లు మొదలియార్ సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మొదలియార్ సంఘ అధ్యక్షుడు కన్నియప్పన్ మొదలియార్, మోహన్ మొదలియార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పింఛన్ నగదు పక్కదారి పడుతోంది

- సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపణ



నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: రాష్ట్రంలో అనేకచోట్ల నెలవారీ ఇచ్చే పింఛన్ నగదు పక్కదారి పడుతోందని, అందుకు కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. గురువారం ఆయన సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యవేడు మండలం కాళమనాయుడుపేటలో ఈ నెల 1న సచివాలయ ఉద్యోగి రూ.2.63 లక్షలతో పరారవడంపై ఆయన స్పందించారు. ఇలాంటి ఘటనలు ప్రతి నెలా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట జరుగుతున్నాయని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ఉన్న కారణంగా పింఛన్ల పంపిణీ పారదర్శకంగా జరగడంతో పాటు ఆ నగదు ఎక్కడా దుర్వినియోగం అయ్యే పరిస్థితి లేకుండాపోయిందన్నారు. వలంటీర్లు బాధ్యతగా పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేసేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థను రద్దు చేసిందన్నారు. పింఛన్ పంపిణీని సచివాలయ ఉద్యోగులకు అప్పజెప్పడంతో అందులో కొందరు తమ వ్యక్తిగత అవసరాల కోసం నెలవారీ పింఛన్ నగదును దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

శ్రీకాళహస్తి: పట్టణంలో కై కాలవీధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తనిఖీ చేశారు. గర్భవతులు, బాలింతలకు ఇచ్చే పోషకాహార కిట్లను, అనంతరం పిల్లల ఎత్తు, బరువు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్ల నిరసన ర్యాలీ




సీడబ్ల్యూఎం దేవ సహాయంకు వినతిపత్రం ఇస్తున్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్ ఫెడరేషన్ పిలుపు మేరకు రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రైల్వే పెన్షనర్స్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీగా చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహం, ఆ తర్వాత రైల్వే స్టేషన్ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైల్వే పెన్షనర్ల విధివిధానాలను మార్చిన బిల్లును రద్దు చేయాలని, కొత్తవారికి, పాత వారికి ఒకే పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, వివక్షతో ఉన్నర పెన్షన్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ ఎస్ హసన్ సాహెబ్, రేణిగుంట సర్పంచ్ నగేషం, బ్రాంచ్ కార్యదర్శి జయంత్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, అప్పారెడ్డి, జాన్ బాబు, రాజేంద్రన్, రవీంద్ర బాబు పాల్గొన్నారు.

సీఆర్ఎస్‌లో..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): కేంద్ర ప్రభుత్వం రైల్వే పెన్షనర్ల విధానాన్ని మార్చడాన్ని నిరసిస్తూ రేణిగుంట సమీపంలోని సీఆర్ఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ గురువారం ర్యాలీ నిర్వహించింది. తమ కార్యాలయం నుంచి సీడబ్ల్యూఎం కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సీడబ్ల్యూఎం దేవ సహాయంకు వినతి పత్రం ఇచ్చారు. కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ, వివక్షతో కూడిన పెన్షన్ విధానాన్ని వెంటనే కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి గజపతి నాయుడు, ఆనంద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రైల్వే పెన్షనర్లు

లాడ్జిలో గుట్టుగా వ్యభిచారం

- నలుగురు యువతులు, ఇద్దరు విటులు, లాడ్జి ఓనర్ అరెస్ట్



లాడ్జిలో పట్టుబడిన విటులు, మహిళలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో భక్తుల ముసుగులో వ్యభిచారం చేస్తున్న ముఠా గుట్టు రట్టు అయింది. తేరువీధిలో ఆలయ సమీపంలోని ఒక లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో గురువారం పోలీసులు దాడులు చేశారు. వ్యభిచారం చేస్తున్న నలుగురు యువతులతో పాటు ఇద్దరు విటులు, లాడ్జి ఓనర్ బలరామ్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు 1వ పట్టణ సీఐ గోపి తెలిపారు. ఇదలా ఉంచితే, ఇతర రాష్ట్రాలు, జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి యువతులను భక్తుల ముసుగులో ఇక్కడికి తీసుకువచ్చి వ్యభిచారం చేయిసున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం సిండికేట్ వ్యాపారంతో మట్కా, వ్యభిచారం కూడా జోరుగా సాగుతోందనే విమర్శలొస్తున్నాయి. పోలీసులు అరెస్ట్ చేసిన లాడ్జి ఓనర్ కూడా అధికార పార్టీ అండదండలు కలిగిన వ్యక్తి కావడం గమనార్హం!

మెనూ ప్రకారం భోజనం పెట్టండి



భోజనం రుచి చూస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల్లో అమలు అవుతున్న మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని మండల విద్యాశాఖాధికారులు రవీంద్రనాధ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. గురువారం వారు మండలంలోని నెలవాయి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. లేదంటే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గదుల వేలం.. పంచాయతీకి ఆదాయం



గదుల వేలం నిర్వహిస్తున్న సర్పంచ్

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరు పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో వ్యాపార సముదాయ గదులకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో రెండు రూములకు సంబంధించి ఒక్కొక్కటి ఏడాదికి రూ.18వేల చొప్పున గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, మునికృష్ణయ్య దక్కించుకున్నట్లు సర్పంచ్ చెప్పారు. పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ రాలేదు.. తిప్పలు తప్పలేదు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ప్రధానమైన స్వామివారి రథోత్సవం గురువారం రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఏటా రథోత్సవం ఉదయం 7.15 గంటలకు ఆరంభమై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ 9.15 గంటలకు యథాస్థానానికి చేరుకోవడం ఆనవాయితీ. అయితే గురువారం తలపెట్టిన స్వామివారి రథోత్సవానికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వస్తారన్న సమాచారంతో చాలా సమయం వరకు ఆలయ అధికారులు, అర్చకులు వేచి ఉండాల్సి వచ్చిందని సమాచారం. సమయం రెండు గంటల దాటినా చైర్మన్ రాకపోవడంతో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు స్వామివారి రథోత్సవం నిర్వహించారు. దీంతో స్వామివారి రథాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి కలిగింది.

ముగిసిన ఉత్సవాలు



చక్రస్నాన క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో భద్రావతీ సమేత భావనారుషి వార్షిక ఉత్సవాలు గురువారం సాయంత్రం చక్రస్నానంతో ముగిశాయి. సాయంత్రం గ్రామ శివార్లలోని అరుణానదిలో చక్రత్తాళ్వార్, కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నది నీటిలో చక్రత్తాళ్వార్‌ను మునకలు వేయించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక అర్చనలు, మహానైవేద్య సమర్పణ అనంతరం ఉత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు ఆలయ మర్యాదలతో గౌరవించారు.

విధులకైనా సమయానికి రండి సారూ..





మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీగా ఉన్న ఏపీఎం కుర్చీ, ఈసీ కుర్చీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఏడుగురు పని చేస్తుండగా గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇద్దరు మాత్రమే కార్యాలయంలో ఉండగా.. మిగిలిన అధికారుల కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఏపీఎం, ఈసీ, ఒక టెక్నికల్ అసిస్టెంట్ విధులకు హాజరుకాలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు సిబ్బంది లేకపోవడంతో చాలాసేపు ఎదురు చూసి వెనుదిరిగారు. సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనులు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయని, దీంతో వలసలు తప్పేలా లేవని వాపోతున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎన్ఎంయూ నేతల నిరసన



సత్యవేడు ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ నాయకులు

సత్యవేడు: ఆర్టీసీలో అన్ని కేటగిరీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ సత్యవేడు ఆర్టీసీ డిపో సెక్రటరీ వి.బాబు కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ పిలుపు మేరకు రెండు రోజుల పాటు ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గురువారం ఉదయం స్థానిక డిపో ప్రవేశ ద్వారం వద్ద ఎన్ఎంయూ అసోసియేషన్ సభ్యులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సెక్రటరీ బాబు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో టికెట్ తీసుకునే బాధ్యత ప్రయాణికుడే వహించేటట్లు చట్టం తీసుకురావాలన్నారు. సంస్థలో ఉద్యోగులకు పని భారం తగ్గించాలని ఆయన కోరారు. గ్యారేజ్‌కు సరిపడా సిబ్బంది, విడి భాగాలు, టూల్స్ ఇవ్వాలన్నారు. ఉద్యోగులందరికీ డిజిటల్ గుర్తింపుకార్డు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 2019 జనవరి సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, ప్రతి ఉద్యోగికి రిటైర్మెంట్‌లోపు పదోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, డిపో అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, కుప్పయ్య, సీసీఎస్ డెలిగేట్ సురేష్, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం



విశ్రాంత ఉద్యోగులకు చిత్రపటాలు అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: విశ్రాంత ఉద్యోగులకు శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు దేవుని చిత్రపటాలను బహూకరించారు. రిటైర్డ్ అయి 15 ఏళ్లు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగులకు పెన్షనర్స్ డే పురస్కరించుకుని శ్రీకాళహస్తి విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంజూరు తారక శ్రీనివాసులు తన మాతృమూర్తి ఉపాధ్యాయురాలు సరోజనమ్మ జ్ఞాపకార్థం 20 ఏళ్ల నుంచి స్వామి వారి చిత్రపటాలను ఇచ్చి వారిని సత్కరిస్తున్నారు. ఈ చిత్రపటాలను అధ్యక్షులు వెంకయ్య, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి వెంకట రమణయ్యకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఈ యాంత్రిక జీవితంలో విశ్రాంత ఉద్యోగులకు జ్ఞానప్రసూనాంబికాదేవి సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి దీవెనలు ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, ముని, వేలూరు రమేష్, తదితరులు పాల్గొన్నారు.